సాక్షి పల్నాడు


శనివారం, 1, మార్చి, 2025

I



నేడు బ్రహ్మంగారి కల్యాణం

విజయపురిసౌత్: గోవిందమాంబ సమేత శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 'కల్యాణ మహోత్సవం' శనివారం నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త తెలిపారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 529.90 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 7,033 క్యూసెక్కులు విడుదలవుతోంది.



కనక దుర్గమ్మకు చండీ హోమం

పిడుగురాళ్ల: భవానీనగర్‌లోని కనకదుర్గమ్మ అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పుణ్య దంపతులు కుంకుమ పూజ నిర్వహించారు.

ఎన్నికల హామీలకు పాతర

- రాష్ట్ర బడ్జెట్‌లో టీడీపీ హామీలకు కేటాయింపులేవి
- మహిళకు ఆర్థిక సాయం, ఉచిత బస్సు పథకాల ఊసేది
- నిరుద్యోగులకు మరోసారి మొండిచేయి
- తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ పథకాలకు అరకొర కేటాయింపులు
- లబ్ధిదారుల జాబితాలో కోతలు ఉంటాయని భయపడుతున్న మహిళలు, రైతులు
- వరికపూడిశెల ప్రాజెక్ట్ పనులకు నిధులు కేటాయించని కూటమి సర్కార్



వరికపూడిశెల ప్రాజెక్టు ప్రాంతం

సాక్షి,నరసరావుపేట: ఎన్నికల్లో గెలవడానికి సూపర్–6తోపాటు అలవిగాని హామీలను ఎన్నింటినో ఇచ్చిన కూటమి ప్రభుత్వం తీరా వాటి అమలుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపుల్లో మాత్రం మొండిచేయి చూపింది. కూటమి ప్రభుత్వం పూర్తిస్థాయిలో ప్రవేశపెడుతున్న బడ్జెట్ కావడంతో శుక్రవారం ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రసంగం కోసం ఎదురుచూసిన ప్రజలకు నిరాశే మిగిలింది. సంక్షేమ పథకాలకు కేటాయింపులు చేస్తారని ఆశించిన పేదోడికి చేదువార్తను వినిపించారు. ముఖ్యంగా సూపర్–6 పథకాలను ఈ ఆర్థిక సంవత్సరమైనా అమలు చేస్తారనుకుంటే వాటి ప్రస్తావనే చేయలేదు. నెలనెలా రూ.1,500 కోసం జిల్లాలో 7,80,538 మంది మహిళలు ఎదురుచూస్తున్నారు. అలాగే ఉచిత బస్సు ప్రయాణం కోసం జిల్లాలో 10,92,752 మంది మహిళలు అర్హులున్నారు. ఇంటింటికి ఉద్యోగం లేదా ఉద్యోగం వచ్చే వరకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అంటూ ఇచ్చిన హామీ అమలు కోసం జిల్లాలో 6.51 లక్షల కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వాటి ఊసే లేదని ఆయా వర్గాలు వాపోతున్నాయి. తల్లికి వందన, సుఖీభవ వంటి పథకాల ప్రస్తావన ఉన్నా వాటికి ఇచ్చిన అరకొర నిధులతో లబ్ధిదారుల వడపోతతో ఎంతమందికి మోసం చేస్తారో అనే భయం ప్రజల్లో మొదలైంది.

వరికపూడిశెలకు కేటాయింపులేవి?

పల్నాడు ప్రజలకు ఎంతో కీలకమైన వరికపూడిశెలకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో నిధులు కేటాయింపులేదు. ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలకమైన ప్రాజెక్టు కోసం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వరికపూడిశెలకు అడ్డుగా ఉన్న అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చేలా చూశారు. అంతేకాకుండా ప్రాజెక్టు పనులను ప్రారంభించారు. దాన్ని కొనసాగించాల్సిన కూటమి ప్రభుత్వం నిధులు కేటాయింపులు చేయకుండా ప్రాజెక్టును అటకెక్కిస్తున్నారని జిల్లా వాసులు వాపోతున్నారు. సాగర్ కాలువల ఆధునికీకరణ, పులిచింతల ప్రాజెక్టు అవసరమైన నిధులు కేటాయింపులలో సైతం బడ్జెట్‌లో సరైన ప్రాధాన్యం ఇవ్వలేదు. పర్యాటక, పారిశ్రామిక అభివృద్ధిలో జిల్లాకు ఏం చేస్తున్నారో పేర్కొనలేదు.

అన్నదాత సుఖీభవకు సరిపడా కేటాయింపులు లేవు...



వ్యవసాయ బడ్జెట్‌లో నిధుల కేటాయింపు నామమాత్రంగానే ఉంది. ఇది రైతులకు భరోసా ఇచ్చేదిగా లేదు. రైతుల సంక్షేమానికి అన్నదాత సుఖీభవ పేరుతో ప్రతి రైతుకి రూ.20,000 సహాయం అందిస్తామని ఊదరగొట్టారు. 2024 సంవత్సరంలో అమలు చేయలేదు. 2025 బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వ పీఎం కిసాన్ పథకంతో కలిపి రూ.9,400 కోట్లు మాత్రమే కేటాయించారు. అంటే కొంత మంది రైతులకు ఎగనామం పెట్టడమే. ముఖ్యంగా కౌలు రైతులను ఎలా గుర్తిస్తారో చెప్పలేదు.

– వై రాధాకృష్ణ, కౌలు రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు.

సంక్షేమ పథకాలకు నిధులేవి..?



సుమారు రూ.3 లక్షల కోట్లతో రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెట్టినప్పటికీ పేదలకు ఆసరాగా నిలిచే సంక్షేమ పథకాలకు కేటాయింపుల్లో రిక్తహస్తం చూపారు. ఇది కేవలం అంకెల గారడీ బడ్జెట్ మాత్రమే. ఎన్నికల హామీలైన సూపర్–6 పథకాలకు నిధులు కేటాయింపులు లేవు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవలకు తక్కువ నిధులు కేటాయింపులు చేశారు. మరి వీటిని ఎప్పుడు అమలు చేస్తారో ప్రజలకు సమాధానం చెప్పాలి.

–కాసా రాంబాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి, నరసరావుపేట.

వరికపూడిశెలకు ఒక్క పైసా కూడా కేటాయించలేదు...



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో పల్నాడు ప్రాంతానికి ఎంతో కీలకమైన వరికపూడిశెల ఎత్తిపోతల ప్రాజెక్టుకు ఒక్క నయా పైసా కూడా కేటాయించకపోవడం దారుణం. వరికిపూడిసెల ఎత్తిపోతల ప్రాజెక్టుకు నాటి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పలు శాఖల నుంచి అనుమతులు తీసుకుని వచ్చారు. వాటిని కొనసాగించి ఉంటే బాగుండేది.

–ఎంఎస్ ప్రసాద్, సీనియర్ అడ్వకేట్, వినుకొండ.

దివాళా కోరు బడ్జెట్



రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ తీరును గమనిస్తే దివాళాకోరుతనం స్పష్టంగా కన్పిస్తుంది. అన్నింటిలోనూ కోత పెట్టారు. ప్రభుత్వ తీరు చూస్తుంటే సూపర్ సిక్స్ అమలుచేయాలనే దృక్పథం కన్పించటంలేదు.

–ఈదర గోపీచంద్, గ్రామ, వార్డు వలంటీర్ల సంఘ రాష్ట్ర గౌరవ సలహాదారు

పల్నాడుకు తీవ్ర అన్యాయం



రాష్ట్ర ప్రభుత్వం మొట్టమొదటగా పూర్తిస్థాయిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో అన్ని విధాలా వెనుబడిన పల్నాడుకు తీవ్ర అన్యాయం జరిగింది. ఎన్నికల హామీలను పరిగణనలోకి తీసుకోలేదు. పల్నాడు ప్రజలను ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న వరికపూడిశెల విషయం ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్‌లకు గుర్తు రాలేదు. కొత్త జిల్లా అవసరాలు, మౌలిక సదుపాయాల కల్పన, మూలనపడిన లిఫ్ట్ ఇరిగేషన్లకు మరమ్మతుల నిధులు, ఉపాధి హామీ పథకం, రైతులకు, కౌలు రైతులకు బడ్జెట్లో ఉపయోగపడే ఊసేలేదు. పరిశ్రమల స్థాపనకు భూము లు ఉన్నప్పటికీ పాలకుల నిర్లక్ష్యంతోనే పల్నా డు వెనుకబడింది. రాజధాని నిర్మాణానికి కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చి పూర్తిస్థాయిలో రాజధాని అభివృద్ధి చేయాలి. సూపర్ సిక్స్‌తో ప్రజలను నమ్మించి మోసం చేశారు. తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, రైతులకు పెట్టుబడి సాయానికి కేటాయింపులు అరకొరగానే ఉన్నాయి.

– గుంటూరు విజయ్ కుమార్, సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శి

ఏమాత్రం చిత్తశుద్ధి లేదు



బడ్జెట్‌పై కూటమి ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి లేదు. నామ్‌కే వాస్తేగా కేటాయింపులు చేశారు. సూపర్ సిక్స్ ఊసే లేదు. శాసనసభలో వ్యవసాయశాఖ మంత్రి బడ్జెట్ ప్రవేశపెడుతుంటే జనసేన అధినేత పవన్ కల్యాణ్ ముచ్చట్లు ఆడుతున్నారు. కొంత మంది నిద్రపోవటం కన్పించింది. పూర్తిస్థాయి బడ్జెట్ రూ.3 లక్షల కోట్లకుపైగా ప్రవేశపెట్టినా అందులో పేదల వాటా ఎంత? మైనార్టీలకు ఏం కేటాయించారు? వంటివి స్పష్టంగా చెప్పలేకపోయారు. తల్లికి వందనం, అన్నదాతా సుఖీభవలకు కొన్ని నిధులే కేటాయించారు. అవి ఎవరికి ఇస్తారు? ఎంతమందికి సరిపోతాయి? బడ్జెట్ ద్వారా నిధులు కేటాయించి ప్రజలకు మంచి చేద్దామనే చిత్తశుద్ధి కనిపించలేదు. అంకెలు చూస్తుంటే రాష్ట్రం దివాళా తీసేలా ఉంది.

–షేక్ కరిముల్లా, ఎంఐఎం జిల్లా అధ్యక్షులు

న్యూస్‌రీల్

సబ్‌జైలు సందర్శన



గురజాల రూరల్ : సబ్ జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి జియావుద్దీన్ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఖైదీలకు భోజనం, వైద్య సేవలు, సకాలంలో అందుతున్నాయా లేదా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు న్యాయ సలహాలకు ఎవరైనా న్యాయవాది లేకుంటే ఉచితంగా సలహాలు ఇచ్చేందుకు న్యాయ సేవా కేంద్రంకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం వంటగది, స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. తనిఖీల్లో ఆయన వెంట పీడీఎం కోర్టు న్యాయమూర్తి కె. సత్యనారాయణ, అదనపు జూనియర్ సివిల్ జడ్జి పి. అలేఖ్య, న్యాయవాది కలివెల ప్రభుదాసు, జైలు సూపరింటెండెంట్ సీహెచ్.అచ్చినాయుడు, అదాలత్ సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక స్థోమత లేకుంటే ఉచిత న్యాయం సాయం



సత్తెనపల్లి: ఆర్థిక స్థోమత లేని రిమాండ్ ఖైదీలకు ఉచిత న్యాయం అందించే సదుపాయం చట్టం కల్పిస్తుందని సత్తెనపల్లి మండల న్యాయ సేవ అధికార కమిటీ చైర్మన్, సత్తెనపల్లి సివిల్ జడ్జి(సీనియర్ డివిజన్) పి.విజయ్ కుమార్‌రెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని సబ్ జైలును శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. సబ్‌జైలులోని పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నవా లేవా అనేది క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలించారు. అక్కడ ఉన్న ఆహార పదార్థాలను, సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. వారికి అందుతున్న సౌకర్యాలు, వసతులు గురించి తెలుసుకున్నారు. ఆయనతోపాటు ప్యానల్ న్యాయవాది బీఎల్ కోటేశ్వరరావు, సబ్‌జైలు సూపరింటెండెంట్ వెంకటరత్నం ఉన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి టీకాలు

నరసరావుపేట రూరల్: పశువులకు ఉచితంగా గాలికుంటు, బ్రూసెల్లోసిస్ వ్యాధి టీకాల కార్యక్రమం శనివారం నుంచి 31వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి డాక్టర్ కె.కాంతారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో పశువులకు వేసేందుకు 4,59,600 డోసులు గాలికుంటు వ్యాధి టీకాలు, నాలుగు నుంచి ఆరు నెలల వయస్సు గల పెయ్యి దూడలకు వేసేందుకు 14,600 బ్రూసెల్లోసిస్ టీకాలు సిద్ధంగా ఉంచినట్టు పేర్కొన్నారు. మూడు నెలలు నిండిన ప్రతి పశువుకు తప్పనిసరిగా గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, నాలుగు నుంచి ఎనిమిది నెలల వయస్సు గల పెయ్య దూడలకు బ్రూసెల్లోసిస్ టీకాలు వేయించాలని సూచించారు.

ఎన్‌ఎస్పీ సూపరింటెండెంట్ ఇంజినీర్ సస్పెన్షన్

నరసరావుపేట: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లింగంగుంట్ల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓ అండ్.ఎం) సూపరింటెండెంట్ ఇంజినీర్ కె.వెంకటరమణారెడ్డి సస్పెండ్ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సరైన పద్ధతిలో సెలవు తీసుకోకుండానే ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్, మాచర్ల, గురజాల ఎమ్మెల్యేలు, సాగర్ ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్‌లకు అందుబాటులో లేకపోవటంపై వారు చేసిన ఫిర్యాదుల మేరకు క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్ చేస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సస్పెండ్ కాలంలో ముందస్తు అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్ వదిలి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

బ్యాలెట్ బాక్స్‌లకు పటిష్ట భద్రత



నరసరావుపేట: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించిన బ్యాలెట్ బాక్స్‌లకు పటిష్ట భద్రత కల్పించాల్సిన అవసరం ఉందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం స్థానిక ఎస్‌ఎస్‌ఎన్ కళాశాలలో బ్యాలెట్ బాక్స్‌లను భద్రపరిచే స్ట్రాంగ్ రూములను అధికారులతో కలసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ బ్యాలెట్ బాక్స్‌ల స్వీకరణ కేంద్రంలోని సిబ్బంది బ్యాలెట్ బాక్స్‌ల స్వీకరణ సమయంలో బాక్స్‌లకు ఉన్న సీళ్లను నిశితంగా పరిశీలించాలని సూచించారు. బాక్సుల స్వీకరణ కేంద్రంలో సిబ్బందికి అవసరమైన తాగునీరు అందుబాటులో ఉంచాలని, ఆహారం, అల్పాహారాలను ఎప్పటికప్పుడు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ముగిసిన విశిష్ట గుర్తింపు నమోదు గడువు

- ఆందోళనలో చామర్రు రైతులు
- మరికొంత సమయం ఇస్తారంటున్న వ్యవసాయాధికారులు



యూనిక్‌ఐడీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న వ్యవసాయాధికారులు

అచ్చంపేట: సొంత భూములు కలిగిన రైతులంతా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసే రాయితీలను పొందాలన్నా, పండించిన పంటను ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు అమ్ముకోవాలన్నా తప్పనిసరిగా 14 అంకెలుగల విశిష్ట గుర్తింపు సంఖ్యను (యునిక్‌ఐడి నెంబరును) కలిగి ఉండాలి. గుర్తింపు సంఖ్య నమోదుకు తుది గడువు శుక్రవారంతో ముగిసింది. మండలంలోని చామర్రు రెవెన్యూ కింద 1200 మంది, కోగంటివారిపాలెం గ్రామానికి చెందిన మరో 500 మందికి రైతులు ఒక్కరూ కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేకపోయారు. గడువు ముగియడంతో వారు ఆందోళన చెందుతున్నారు. దీనిపై రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన లేకపోవడం కూడా ఓ కారణం.

మొరాయిస్తున్న ఆన్‌లైన్ సేవలు

రైతు సేవా కేంద్రాలలో ఆన్‌లైన్ సేవలు మొరాయిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పీఎం కిసాన్ యోజన లబ్ధిదారులు 7697 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటివరకు సగం మంది రైతుల పేర్లు కూడా ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు. వారికి 14 అంకెల యూనిక్ ఐడీ నెంబరు కేటాయించలేదు. ముఖ్యంగా మండలంలో 18 రెవెన్యూ గ్రామాలు ఉండగా చామర్రు రెవెన్యూ కింద 1200, కోగంటి వారిపాలెం కింద 500మంది రైతులు ఉన్నారు. ఒక్కరి భూమి కూడా ఆన్‌లైన్ కాలేదు. వ్యవసాయశాఖ సూచించిన విధంగా రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, ఆధార్‌కు లింకైన ఫోన్ నెంబరుతో రైతు సేవా కేంద్రాలకు వెళ్లినా ఆన్‌లైన్ సేవలు మొరాయిస్తున్నాయే తప్ప నమోదు కావడంలేదు. చివరకు గడువు ముగియడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆన్‌లైన్‌లో నమోదు కాలేదు



సొంత భూములున్న రైతులంతా తప్పనిసరిగా యూనిక్ ఐడీ తప్పనిసరిగా పొందాలని వ్యవసాయాధికారులు ప్రకటించారు. నాకు చామర్రు రెవెన్యూ కింద ఐదెకరాల భూమి ఉంది. రైతు సేవా కేంద్రానికి వెళితే ఆన్‌లైన్ కావడం లేదని చెబుతున్నారు. ప్రభుత్వం ప్రకటించిన గడువు ముగిసింది. నేను ఎలా రాయితీలు పొందగలను.

-కొమరాల నరసింహస్వామి, రైతు, అచ్చంపేట

మరికొంత సమయం ఇస్తారు



చామర్రు రెవెన్యూ కింద ఉన్న రైతులందరికీ మరికొంత సమయం ఇస్తారు. రాష్ట్రంలో ఇలాంటి గ్రామాలు 15 వరకు ఉన్నాయి. వీరందరికి ఆన్‌లైన్‌తో సంబంధం లేకుండానే పీఎం కిసాన్ నగదు జమ చేయడం జరుగుతుంది. ఇప్పటికే చాలా మంది రైతుల ఖాతాలలో నగదు జమ అయింది. కోగంటివారిపాలెంలోని ఇనాం భూములు కావడం, వాటికి పాసుపుస్తకాలు లేకపోవడం వల్ల వాటిని ఆన్‌లైన్ చేయలేం.

-పి.వెంకటేశ్వర్లు, ఏవో, అచ్చంపేట.

డ్రగ్స్ రహిత జిల్లాగా పల్నాడు

జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు



నరసరావుపేట: పల్నాడును డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు, ఎస్పీ కంచి శ్రీనివాసరావు అధికారులను ఆదేశించారు. అన్నీ ప్రభుత్వ శాఖలు సమన్వయం, ఉమ్మడి భాగస్వామ్యంతో జిల్లాలో డ్రగ్స్ జాడ్యంపై పోరాటం చేయాలన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఇరువురూ కలిసి బాలలు–మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు నియంత్రణ చర్యలపై పోలీసు, విద్య, ఎక్సైజ్, సాంఘిక సంక్షేమం, పంచాయతీ రాజ్, సమాచార–పౌర సంబంధాలు, మహిళా శిశు సంక్షేమం, వైద్య, ఆరోగ్య శాఖలు, రైల్వే విభాగానికి సంబంధించిన ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో డ్రగ్స్ నియంత్రణ కోసం చేపడుతున్న కార్యక్రమాల గురించి వివిధ శాఖల అధికారులకు వివరించారు. కలెక్టర్ అరుణ్‌బాబు మాట్లాడుతూ మెడికల్ షాపులు, మద్యం దుకాణాల్లో తప్పని సరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. లిక్కర్ షాపులు, బార్లు పాఠశాలలకు దూరంగా తరలించాలన్నారు. విద్యాలయాల్లో క్యాంపస్ క్లబ్స్ ఏర్పాటు చేయడం ద్వారా పిల్లలు, వారి తల్లిదండ్రులతో కలసి కమిటీలు, మీటింగ్‌లు నిర్వహించాలని విద్యాశాఖను ఆదేశించారు. ఎస్పీ కంచి శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసు శాఖ వైపు నుంచి మత్తు పదార్థాల నివారణపై మెరుగైన ప్రచార వీడియోలు రూపొందిస్తామన్నారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు
- హాజరు కానున్న 32,434 మంది విద్యార్థులు
- జనరల్ 30,560 మంది, ఒకేషనల్ 1,874 మంది విద్యార్థులు
- కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఐఈఓ నీలావతిదేవి

నరసరావుపేటఈస్ట్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మార్చి 19వ తేదీ వరకు పరీక్ష జరుగుతాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నారు. శనివారం ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షలు మొదలు కానున్నాయి. జిల్లాలో 48 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. 32,434 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కానున్నారు. వీరిలో జనరల్ విద్యార్థులు 30,560 మంది, ఒకేషనల్ విద్యార్థులు 1,874 మంది ఉన్నారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులలో బాలికలు 9,219, బాలురు 8,686 మంది, ద్వితీయ సంవత్సరంలో బాలికలు 7,608, బాలురు 6,921 మంది ఉన్నారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ఒక్కొక్క పరీక్ష కేంద్రానికి ఒక చీఫ్ సూపరింటెండెంట్, ఒక డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లను నియమించారు. వీరితోపాటు రెండు ఫ్లైయింగ్ స్క్వాడ్ లు, రెండు సిట్టింగ్ స్క్వాడ్ బృందాలను ఏర్పాటు చేశారు. 500మంది విద్యార్థులు దాటిన కేంద్రాలలో అదనపు డిపార్ట్‌మెంట్ ఆఫీసర్‌లను నియమించారు.

సీసీ కెమెరాల పర్యవేక్షణ..

పరీక్ష కేంద్రాలను సీసీ కెమెరాల ద్వారా పర్యవేక్షించనున్నారు. ఆయా కేంద్రాలలోని పరీక్ష జరిగే గదిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. పరీక్ష జరుగుతున్న సేపు సీసీ కెమెరా లైవ్ స్ట్రీమింగ్‌లో ఉండేలా చర్యలు తీసుకున్నారు. సీసీ కెమెరాలను ఇంటర్మీడియెట్ బోర్డుతోపాటు బోర్డు జిల్లా కార్యాలయానికి అనుసంధానం చేశారు. పరీక్ష నిర్వహణ తీరును అధికారులు పర్యవేక్షించనున్నారు.

నో ఫోన్ జోన్..

పరీక్షా కేంద్రాలను నో ఫోన్ జోన్‌గా అధికారులు ప్రకటించారు. ఆయా కేంద్రాల సీఎస్, డీఓలతో సహా సిబ్బంది ఎవరూ మొబైల్ ఫోన్, మరే ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను వినియోగించేందుకు వీలు లేదు. నిబంధనలు అతిక్రమించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. పరీక్ష కేంద్రాల ప్రాంతంలో 144 సెక్షన్ అమలు చేయటంతోపాటు చుట్టుపక్కల జిరాక్స్ సెంటర్లను మూసి ఉంచేలా చర్యలు తీసుకున్నారు.

కంట్రోల్ రూమ్ ఏర్పాటు..

పరీక్షల నిర్వహణలో పొరపాట్లకు తావివ్వకుండా నిర్వహించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 08647–223355 నంబర్‌కు ఫోన్‌చేసి సమస్యకు పరిష్కారం పొందవచ్చు. కంట్రోల్ రూమ్‌లో ముగ్గురు పరీక్షల నిర్వహణ అధికారులు(డీఈసీఓ) అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు.

ప్రశాంత వాతావరణంలో పరీక్షల నిర్వహణ

జిల్లాలో పరీక్షల నిర్వహణ సజావుగా నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి నిరంతరం పర్యవేక్షిస్తాం. విద్యార్థులకు హాల్ టికెట్లు వాట్సాప్ గ్రూప్‌ల ద్వారా పంపించాం. ప్రిన్సిపల్ సంతకం లేకుండా పరీక్షకు అనుమతించాలని కేంద్రాల నిర్వాహకులకు ఆదేశాలిచ్చాం. పరీక్ష కేంద్రాలలో మౌలిక వసతులు కల్పించాం. విద్యార్థులు సకాలంలో హాజరై ప్రశాంత వాతావరణంలో పరీక్ష రాసి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నాం.

– ఎం.నీలావతిదేవి, డిఐఈఓ, పల్నాడుజిల్లా

టీడీపీ అరాచకాలపై విచారణ చేపట్టాలి

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి



మాట్లాడుతున్న డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట: మహాశివరాత్రి సందర్భంగా కోటప్పకొండ తిరునాళ్లలో వైఎస్సార్ సీపీ వారిపై తెలుగుదేశం పార్టీ దమనకాండపై విచారణ చేసి, నిందితులను అరెస్టు చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నడూ లేనివిధంగా అరాచక సంప్రదాయాలకు టీడీపీ తెరతీసిందని చెప్పారు. తిరునాళ్లలో ఎన్నో ఏళ్లుగా ఏ పార్టీకి చెందిన వారైనా ప్రభలు కట్టుకోవచ్చునని, ఎవరికి ఇష్టమైన పాటలు వాళ్లు వేసుకోవచ్చునని గుర్తు చేశారు. ఈ తిరునాళ్లలో గోనెపూడి గ్రామానికి వైఎస్సార్ సీపీ ప్రభ వద్దకు ఆ పార్టీకి చెందిన సానుభూతిపరులు, అభిమానులు వచ్చి డీజేలో పాటలకు నృత్యాలు చేశారని చెప్పారు. టీడీపీ వర్గీయులు ప్రభ వద్దకు వచ్చి డీజేను, లారీను ధ్వంసం చేయటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అరవపల్లిలో వైఎస్సార్ సీపీకి చెందిన పులుసు కోటేశ్వరరావు, రాంబాబులపై జనసేన, టీడీపీలకు చెందిన వారు దాడులు చేయడం అమానుషమని అన్నారు. గ్రామంలో టీడీపీ కార్యకర్తలు డీజే తీసుకొని పై వారి ఇళ్ల మీదుగా వెళుతూ వారి ఇళ్ల వద్ద గంటల తరబడి రచ్చ రచ్చ చేస్తుంటే, ఆడవాళ్లు వచ్చి ముందుకు వెళ్లండయ్యా అని కోరిన రాంబాబు భార్య, ఆమె కూతుర్ని ఆడవాళ్లని కూడా చూడకుండా ఇష్టం వచ్చినట్టు కొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. అడ్డొచ్చిన రాంబాబును దారుణంగా కొట్టారని చెప్పారు.

రాష్ట్ర మంత్రికి తప్పని ట్రాఫిక్ కష్టాలు

తిరునాళ్లలో మొదటి నుంచి కూడా భక్తులు అనేక కష్టాలు పడ్డారని, పట్టపగలే మధ్యాహ్నం ఒంటిగంట దగ్గర నుంచే పెట్లూరివారిపాలెం వద్ద ట్రాఫిక్ జామ్ అయిందని పేర్కొన్నారు. ఈ సమస్యకు త్రికోటేశ్వర స్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించడానికి వచ్చిన దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి కూడా చిక్కుకున్నారని చెప్పారు.

అన్నదానంపైనా ప్రతాపం..

కొండపైన భక్తులకు చిలకలూరిపేటకు చెందిన తేళ్ల సుధీర్, శ్రీధర్ అనే వ్యక్తులు మూడేళ్ల నుంచి 20వేల మంది భక్తులకు ఉచితంగా అన్నదానం చేస్తున్నారని, అటువంటి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని టీడీపీ ప్రభుత్వం అనుమతులు ఇవ్వకుండా నిలిపివేశారని, ఇది దారుణమైన విషయమని అన్నారు. సమావేశంలో గోనేపూడి, అరవపల్లి గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులే లేవు..

కోటప్పకొండలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అభివృద్ధి చేయలేదని టీడీపీ వారు స్టేట్‌మెంట్లు ఇవ్వటం సిగ్గుచేటని, గడిచిన తొమ్మిది నెలల్లో కొండపై ఒక అభివృద్ధి కార్యక్రమం కూడా చేయటం చేతకాని ఈ ప్రభుత్వం మా మీద విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. తమ ప్రభుత్వ హయాంలో సుమారు రూ.17 కోట్లతో యలమందరోడ్డు, బ్రిడ్జి నిర్మాణం చేపట్టామని, మూడు ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటుచేశామని, కాల్వకట్ట దగ్గర రూ.90లక్షలు ఖర్చుపెట్టి తారు రోడ్డు వేశామని చెప్పారు. రూ.4.5కోట్లతో జీఎస్టీయూ రోడ్డు వేయడం జరిగిందని, ఈ రోడ్డు భక్తులు తిరుగు ప్రయాణానికి ఎంతో సౌకర్యంగా ఉందని, ఈటీ రోడ్డు–యక్కలవారిపాలెం–యాదవ సత్రం రోడ్డును రూ.కోటితో నిర్మించడం జరిగిందని వివరించారు. శివ కుటుంబం విగ్రహాలు కట్టామని, సెంట్రల్ డివైడర్ ఏర్పాటుచేసి లైటింగ్ ఏర్పాటు చేయటం జరిగిందని, నందీశ్వరుడు, దక్షిణామూర్తి విగ్రహాలు తమ హయాంలోనే ఏర్పాటు చేశామని గుర్తుచేశారు.